# పరిణామము

♦ శ్రీ ఆరుమిల్లి విశ్వనాథరావు ♦

పిచ్చిపిల్ల నేనంటే ప్రాణాలిస్తుంది. ఆమెనంతగా ఆకర్షించటానికి నాలోవున్న గొప్పతనం ఏమిటో నాకే అర్థంగాదు. నేను భాగ్యభోగాలతో సుఖమయ జీవితాన్ని వెళ్ళిస్తున్నానా అంటే, అది పూజ్యం. అనేక దఫాలు హోటలుకు వెళ్ళకుండా (డబ్బులేని కారణాన) పస్తులతో గదిలోనుండి కదలని క్షణాలలో వద్దన్నా, నిరాకరించినా, వినకుండా తన ఇంట్లోంచి భోజనం తెచ్చి దగ్గర కూర్చుండి తినేవరకూ ముద్దుగా కోప్పడుతూ లాలించి చింతారహితుణ్ణిగా తయారుచేసే ఆమెకు తెలియందికాదు నా ఆర్థికస్థితి. నాలో యేమయినా ఇతర విశేషాలు ఉన్నవా అంటే నాకు తెలిసినంత వరకు నేను గొప్ప విద్యావంతుణ్ణికాను, చిత్రకారుణ్ణికాను. గాయకున్నానుకోటానికి ఆలక్షణాలు నాలో మొదలే సూన్యం. ఇవేమీ, లేకపోయినా గొప్ప అందమయినవాడినా అంటే ఆవిషయంలో పోటీపెడితే నాకు ఒక్కవోటుకూడా రాదు. ఇక నాలో ఏమిచూసి ఆమె నన్ను అంతగా ఆదరిస్తుందో, అంతగా ప్రేమిస్తుందో, అంతగా లాలిస్తుందో తలంచుకుంటే ఆమెయందు నాకు యేమో తెలియని ఊహించలేని భావాలు కల్గుతుంటవి.

ఆమె సుందర ముఖారవిందాన్ని గాంచి మూడు వత్సరాలు గతించిపోయినై. ఆరోజున నెహ్రూ మైదానంలో బ్రిటిష్ వ్యతిరేక ఉపన్యాసం ఇచ్చినందుకై అరెస్టుచేసి నన్ను కారులో ఎక్కించి తీసుకుపోయేముందు, చిన్నబోయిన ముఖంతో ఆ ప్రజల మధ్యనుండి చూసిన ఆమె మాపుల్లోని ఆర్తృత, ఆ వేదనా తలంచుకుంటే ఆనాటి ఆక్షణమందలి దృశ్యం ఇంకను నాహృదయంలో మెరుల్తోంది.

ఈ జైలుగదిలో బ్రిటిష్ అధికార పాశములచే బంధించబడిన తర్వాత, శాంతవార్త తెలియలేదు. నాకు తెలిసినంతవరక్కు ఆమె, ఆమె తండ్రి తప్ప మూడవ వ్యక్తి ఆయింట్లో ఉన్నట్టు నాకు జ్ఞాపకంలేదు. ఆమె తండ్రికి పూర్వులార్జించిన భూవసతి అక్కడికి దగ్గరగావున్న పల్లెటూరిలో కొంత ఉన్నదనీ దానిపైన వచ్చే ఫలసాయంవల్ల వారు జీవిస్తువారని శాంత అప్పుడప్పుడు అంటూ ఉండేది. నేను అప్పుడప్పుడు అనుకునేవాణ్ని ఆయన ప్రౌఢయైన శాంతకు వివాహం ఎందుకుచెయ్యలేదోనని. ఈ విషయంలో నా సందేహాలు చాలా దూరంవరక్కు పొయ్యేవి. అయినా నేను ఒక్కసారి కూడ శాంతను అడగలేదు. అయినా ఆమెకు మాత్రం యేంతెలుస్తుంది? ఒకవేళ అడిగితే అజ్జిస్తుందేమోనని నేను సాహసించలేదు.

నేను యిలా ఆలోచించుకుంటూ మధ్యమధ్య కునికిపాట్లు పడుతూ ఉండగానే తెలతెలవారింది. నా డైరీ చూసుకున్నాను. గతించిన రాత్రితో నాశిక్షాకాలం పూర్తిఅయింది నా విడుదలకు ఉత్తరవులు వచ్చినై. విడుదల అయ్యాను. ముప్పది ఆరునెలలుగా నన్ను తన గర్భంలో నిర్బంధించిన ఆ జైలు గదికి కృతజ్ఞతలు అర్పించి బయటికి వచ్చాను. మూడు సంవత్సరములు తర్వాత నేను సూర్యభగవానుని దర్శించటం అదే మొదటిసారి. నిర్మలాకాశములో నుండి వచ్చిన స్వేచ్ఛావాయువులు ఒక్కసారి నన్ను స్పర్శించి ఉత్సాహపూరి

తుణ్ని చేసినై. ఏమేమో ఆలోచించుకుంటూ బయటి ప్రపంచంలో కలిసి నేను నడుస్తున్నాను. నా గమ్యస్థానమేదో అప్పటికి అప్పటికేనాకు స్ఫురణకు రాలేదు. ప్రజలలో వినిపించే మాటలనుబట్టి భారత రాజకీయాలు ఎంత ముందుపోయినవో తెల్సుకున్న నాహృదయం ఉప్పొంగినది. నేను ఎలా మారానో యేమో! ప్రతివ్యక్తీ నన్ను నిదానించి వింతగా చూస్తున్నాడు. నన్ను చూసి కొందరు భయపడినట్టు దూరంగా తప్పుకుంటున్నారు. నేను ఎవరినీ మాట్లాడించకుండా వెళ్ళిపోతున్నాను.

— ౨ —

“శాంత నొకసారి పిలుస్తారా ?”

ఆ అరుగుపయిన వాలుకుర్చీలో కూర్చుని పేపరు చదువుకుంటున్న ఒక వ్యక్తిని నేను ప్రశ్నించాను.

“ఎవరు నువ్వు?”

“నే నెవరైతే నేమి; దయచేసి ఆమె నొక్కసారి పిలిస్తే మీకు కృతజ్ఞతలు తెల్పుతాను”

“ఎవరామె ?”

“శాంత”

“శాంత, ఏశాంత ?”

“అయ్యో! ఈ యింట్లో ఉంటూ శాంత నెరుగరా ?”

“నాకు తెలిసినంతవరకు ఈయింట్లో ఏ శాంత లేదు.”

“మీరు పరిహాసమాడుతున్నారు. అందుకిది సమయంకాదు. రాఘవేంద్రబాబు, ఆయన కుమార్తె శాంత.”

“బ్రదర్! ఆయనెవరో మనకు తెలీదు. ఈ యింట్లో అలాటివాళ్ళు ఎవరూలేరు. ఈగృహంలో ప్రస్తుతం ఉంటున్నది నేను. ఆరుమాసాల్నించి నేనీ యింట్లో అద్దెకి ఉంటున్నా. నాకు అద్దెకిచ్చింది కూడ మీరు పేర్కొన్న వ్యక్తికాదు.”

ఇంకేమీ మాట్లాడకుండా ఆయన తన పేపరు ధోరణిలో మునిగిపొయ్యేడు. నేను నిస్పృహతో అయిదు నిమిషాలు ఊహాప్రపంచంలో తేలిపోయి అక్కణ్నించి కదిలాను. ఇరుగుపొరుగున వాకబు చేయగా తెల్సిన విషయాలేమంటే రెండు సంవత్సరాలు క్రితమే టైఫాయిడ్ వల్ల శాంత తండ్రి అకస్మాత్తుగా చనిపోయాడని, ఆపయిన శాంత ఏమయినదో తెలియలేదని తెలిసినది. ఎవరినడిగినా శాంత ఉనికి చెప్పలేకపోయారు.

ఆరుమాసాలు గడిచిపోయినై. విప్లవ రాజకీయ కార్యక్రమంలో ఊరూర పల్లెపల్లె తిరుగుతూ ఉన్నాను. ఈరోజుల్లో శాంత నా జ్ఞాపకవీధి నుండి మాయమయ్యినది.

వారంరోజులు క్రితం నేను ఆవూరు చేరి అచ్చట నాకార్యక్రమంలో ఉన్నాను. పార్టీ ఆఫీసులో వొంటరిగా కూర్చుని కొన్ని అవసరమయిన కాగితాలు చూసుకుంటున్నాను. ఇంతలో ఒక్క మిత్రుడు తొందరగా వచ్చి నన్ను హెచ్చరించాడు.

“నీపయిన అరెస్టు వారంటు.”

“ఎవరంటిరి ?”

“నాల్గురోజులు క్రిందట ప్రకటించబడింది. నువ్విక్కడ ఉన్నట్టు తెలిసింది. బహుశా యీరాత్రే అకస్మాత్తుగా పోలీసువారు రావచ్చు.”

“సరే, మంచివార్త.”

“మంచి, తర్వాత ఆలోచించుదాం. ప్రస్తుత కర్తవ్యం.”

“కర్తవ్యం నాకు తెలుసు. ఫలాయనమే కర్తవ్యం. నాయవ్వనరక్తాన్ని ఇక ఆకారాగారాల పాలుచేసి వృధపుచ్చుట నాకిష్టంలేదు. అజ్ఞాతవాసంలోనే యీ పరప్రభుత్వాన్ని ఎదిరించి నాకార్యక్రమాన్ని నావిధిని నేను నిర్వర్తించుకుంటాను. మిత్రుడా! ఇక్కడే అపుడపుడు మిమ్మలను కలుసుకుని కార్యక్రమం అందచేస్తాను. జైహింద్ !!!”

ఆ అంధకారంలోనే నేను పార్టీ ఆఫీసును విడిచిపెట్టి పట్నంలో ప్రవేశించాను. అజ్ఞాతంగా నేను అచ్చట సంచారం చేస్తున్నాను.

## 3

ఒకరోజు రాత్రి 12 గంటలు అయివుంటుంది. నేను ఆఫీసులోనికి వెళ్ళివస్తున్నాను. ఆచీకట్లో నన్నెవరో అనుసరిస్తున్నట్టు సందేహించాను. నాసందేహం నిజమే. ఒకవ్యక్తి నన్ను నీడలా వెంటాడుతున్నాడు. నేను తొందరగా నడుస్తూ పెద్దరస్తానుండి ఒక ఇరుకు గల్లీలోనికి తప్పుకున్నాను. తొందర తొందరగా ఒక చిన్న భవనపు అరుగు ఎక్కి మాస్తును గదా ఆ అంధకారంలో ఆవ్యక్తికూడ ఆగల్లీలోనికే ప్రవేశించాడు ఇక ఉపేక్షకు అవకాశము లేని సమయము. నేను ధైర్యముగా ఆయింటి తలుపు త్రోయగా లోన గొళ్ళెము వేయని కారణముచే తెరచుకున్నది. నేను లోనప్రవేశించి తలుపు నెమ్మదిగా గడియవేసితిని. లోన చీకటిగా ఉన్నది.

ఆఇల్లు యెవరిదో లోన మనుష్యులుండిరో లేదో యను ప్రశ్నతో నాకపుడు పని కల్గలేదు. లోన అంతయూ చీకటిగావున్నది. అగ్గిపుల్ల వెల్గించితిని. ప్రక్కనే ఒక మంచముపై నిద్రపోవుచున్న ఒకయువతి భయక్రాంతయై బొంగురు స్వరముతో ఒక్కసారిగా "దొంగ" అని అరచినది. నేను ధైర్యముతో నెమ్మదిగా "క్షణము ఆగుము, నేనుదొంగను కాను అంతయూ చెప్పెదను" ఆమె ఏమనుకున్నదో, మరేమియూ కేకలువేయక స్విచ్ నొక్కి లైటు వెలిగించినది. ఆ విద్యుద్దీప కాంతిలో ఒక్కసారి ఆమె ముఖకమలం పరీక్షించిన నేను ఆశ్చర్య సంభ్రమోభరితుండనైతిని. నేను కాంచునది కలకాదు. అది వాస్తవజగత్తు ఆమెకాంత. నాకు హృదయశాంతిని ప్రసాదించే కాంత. నన్ను చూడటంతో ఆమెఒక్కసారిగా నిర్ఘాంతపోయిన మోముతో "రామ్!" అంటూ నామీద వాలిపోయింది. ఆమె సాహసమునకు నాకాశ్చర్యమే కల్గినది. ఆమెను నెమ్మదిగా ఆ మంచముపై కూర్చుండబెట్టి నేనుకూడ ఆమె ప్రక్కనే కూర్చుంటిని. ఆమె కండ్లు అప్రయత్నముగ బాష్పపూరితములయినవి. ఆమె చెప్పటం ప్రారంభించింది.

"మీరు వినివుంటారు నాన్నపోయిన సంగతి. యీప్రపంచంలో నేను ఏకాకినై పోయాను. చనిపోయేముందు నాన్న నన్ను తన ఒక దూరపు బంధువుకు వప్పజెప్పారు. ఇదే ఆయనఇల్లు. ఆయన భార్యతో మేడపయిన నిద్రపోతున్నారు. ఇచ్చట నా జీవితం నరకప్రాయంగావుంది. అయినా యేమి చెయ్యగలను? నిస్సహాయురాలను. నేను ఇటుపయిన ఇచ్చట వుండలేను."

"అయితే యెక్కడికి వెళ్ళాలని?"

"ఎక్కడి కయినా విధి నిర్దేశించినచోటికి. మీతో నేనుకూడా వచ్చేస్తాను"

"ప్రమాదం. నేనిపుడు అజ్ఞాతంలో వున్నాను. ప్రభుత్వందృష్టి నా కొరకు దేశమంతట సారించి అన్వేషిస్తున్నది. ఏక్షణంలో నేను పట్టుబడి జైలులో బధించబడబోతానో చెప్పుట కష్టం. నీవు అబలవు సుకుమారివి విప్లవపోరాటంలో నీవు పాల్గొనలేవు"

ఆమెకండ్లు ఎర్రబడినై. ఆరుధిర నేత్రాలలో కోపం స్ఫురిస్తున్నది.

"నీవంటి విప్లవవీరుడు ఒక భారత నారీమణికి ప్రస్తుత దేశపరిస్థితులలో యివ్వవలసిన సలహా కాదిది. ఎంతమంది నారీమణులు భారత విప్లవ పోరాటంలో పాల్గొనలేదు. ఎంతమంది తమ ప్రాణాలను త్యాగం చెయ్యలేదు. ఎంతమంది తమ రక్తస్రవంతులచే భారత మాతకు అంజలు అర్పించలేదు."

ఉద్రేకముచే ఆమె ముఖము ఎర్రబడినది. ఆమె ధీరత్వమునకు నా హృదయముప్పొంగినది. ఆ క్షణంనించే ఆమె జాతీయ పోరాటంలో పాల్గొనటానికి శరీరముచేరి ఆవేడి రక్తముతో ప్రతిజ్ఞ చేసినది. ఆఅర్ధరాత్రి సమయమందే మేమాగృహమును వీడి మా కార్యక్రమానికై ఆకారు చీకటిలో ప్రవేశించితిమి.

జైహింద్!!!